విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - పాలకొల్లు : సంక్రాంతి పండుగ నేపథ్యంలో పేకాట, గుండాట, కోడిపందాలు నిర్వహించ కూడదని ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి అసాంఘిక కార్యకలాపా లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పాలకొల్లు రూరల్ సిఐ కొండవీటి శ్రీనివాస కుమార్ మంగళవారం హెచ్చరించారు. ఇప్పటికే పాలకొల్లు మండలంలో పలు గ్రామాల్లో కోడిపందాలకు సిద్ధం చేసిన బరులను ధ్వంసం చేశామన్నారు. ఈ విషయాలపై ప్రజలకు ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. ప్రజలు జూద క్రీడలపై కాకుండా, సాంప్రదాయ క్రీడలపై దృష్టి సారించాలని కోరారు. ప్రజలకు సేవ చేసేందుకే పోలీసు వ్యవస్థ ఉందని, ఎవరికైనా ఈ తరహా అసాంఘిక కార్యకలాపాల సమాచారం ఉంటే తమకు తెలియజేయాలని కోరారు.

యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం : యువత క్రీడా స్ఫూర్తని పెంపొందించుకోవాలని ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. బొర్రంపాలెం గ్రామంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలను మంగళ వారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జూదం,కోడి పందెం,గుండాట వంటి చెడు వ్యసనాలకు దూరంగా వుండాలని తెలిపారు.వివిధ గ్రామాల నుంచి 11 జట్లు వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు దంతధావన విధానంపై అవగాహన

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరులోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం దంత ధావన విధానం పద్ధతి ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ లక్ష్మీ సౌజన్య అవగాహన కల్పించారు. ఆయుర్వేద వైద్య విధానం, వేప, గానుగ కొమ్మలతో దంత సంరక్షణ చేసుకోవడం పట్ల అవగాహన కల్పించారు. దంతాల ఆరోగ్యం కొరకు ఆచరించాల్సిన అనేక అంశాలను వివరించారు. శీతాకాలం లో వచ్చే వ్యాధులకు నివారణ మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎంఆర్ఎస్ కె. చక్రవర్తి, ఉపాధ్యాయులు కె.హరికృష్ణ, తూతిక శివయ్య, ఆయుర్వేద వైద్యశాల సిబ్బంది కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

దళితులు ఆత్మ గౌరవ పోరాటాలు చేయాలి

విశాలాంధ్ర -భీమవరం: రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల కోసం దళితులంతా ఆత్మ గౌరవ పోరాటాలు చేయాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంట సుందర్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం రాజ్ ట్రస్ట్ కార్యాలయంలో దళిత ఐక్య వేదిక శాఖా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లు 20 శాతం పైగా పెరగాలని ఆ దిశగా పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాజ్యాంగ ఫలాలు అట్టడుగుకు చేరడంలేదని, రిజర్వేషన్లు సక్రమంగా అమలు కావడంలేదని, ప్రయివేటు రంగంలో కూడా ఎస్సీ ఎస్టీ లకు రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాదే మహేష్, జి.డేవిడ్ కరుణాకర్, ఎ.నిర్మల, పి.ఉషారాణి, ఎం.సైమన్,కె.సుగుణ, ఎస్.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో పురుడు పోసుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలో పురుడు పోసుకోవాలని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ సంతోష్ నాయుడు, డాక్టర్ పి.కిరణ్మయి అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కేంద్రము,అన్ని సచివాలయం నుండి వచ్చిన మొదట 'రెండవ గర్భిణీ 'స్త్రీలను వైద్యాధికారులు 67 మందిని పరీక్షించి మందులు ఉచితంగా అందించారు.ప్రతి గర్భిణీ తప్పని సరిగా 4 సార్లు ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలని,మంచి పోషక విలువలు కలిగిన పదార్థాలను తీసుకోవాలని ఐరన్ మాత్రలు, కాల్షియం బిళ్లలు వాడాలని, ప్రభుత్వ ఆసుపత్రిలోపురుడుపోసుకోవాలని ప్రతి గర్భిణికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ జె విల్సన్ బాబు, సిహెచ్ శ్రీనివాస్, హెచ్ వి పద్మరాగం, ఏఎన్ఎం, ఆశ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



విశాలాంధ్ర- పోడూరు: మండలంలోని గ్రామాలలో సంక్రాంతి పండుగకు ఎవరైనా కోడిపందాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోడూరు ఎస్ఐ నాగలక్ష్మి తెలిపారు. మండలంలోని మహిళా పోలీసులతో కలిసి పోడూరులో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోడూరు పోలీస్ స్టేషన్ వద్ద నుండి కవిటం వంతెన సెంటర్ వరకు ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా యస్ ఐ మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు యువత పేకాట గుండాట, కొడిపందాలు వంటి వాటికీ దూరంగా ఉండాలన్నారు. గ్రామాలలో పందాలు నిర్వహిస్తున్నట్లు, పందాలకు ఏర్పాటు చేస్తున్నట్లుగాని సమాచారం తెలిస్తే అడ్డుకుని తమకు సమాచారం ఇవ్వాలని, వీఆర్వోలకు మహిళా పోలీసులకు ఎస్ఐ సూచించారు. మండలంలోని పలు గ్రామాల వీఆర్వోలు మహిళా పోలీసులు ఈ ర్యాలీ లో పాల్గొన్నారు.

శ్రీవారి హుండీల ఆదాయం 1.95కోట్లు

విశాలాంధ్ర - ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి హుండీల ద్వారా రూ.1,95,55,063 ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వాహణాదికారి వేండ్ర త్రినాథరావు పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో మంగళవారం భక్తులు సమర్పించిన హుండీల కానుకలను లెక్కించారు. గడచిన 21రోజులకు పైనగదుతోపాటు 307గ్రాముల బంగారం, 7కేజీల 10గ్రాములు వెండి లభించాయన్నారు. వీటితోపాటు పలు విదేశీకరెన్సీనోట్లు లభించాయన్నారు. హుండీల లెక్కింపులో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తిమ్మాపురంలో కోడిపందెం బరి ధ్వంసం

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల మండలం తిమ్మా పురంలో కోడిపందాల నిర్వహణకు సిద్ధం చేసిన పందెం బరిని మంగళ వారం పోలీసులు ధ్వంసం చేశారు. పందెం బరిని ట్రాక్టర్‌తో దున్నించి, పారలతో తవ్వించారు. బరిని సిద్ధం చేసిన వారికి పోలీసులు రెవిన్యూ అధికారులు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై టి.సుధీర్ మాట్లాడుతూ కొంతమందిపై బైండోవర్ కేసులు నమోదుచేశామని, నిర్వహణకు స్థలాలు అద్దెకిచ్చే వారికి నోటీసులు జారీ చేశామన్నారు.

వేడెక్కిన రాజకీయం

- చంద్రబాబు, పవన్ భేటీ పై సర్వత్రా చర్చ
- రెండు పార్టీల వ్యూహాలపై వైసీపీలో తర్జనభజన

విశాలాంధ్ర బ్యూరో- ఏలూరు: చంద్రబాబు, పవన్ భేటీ పై పార్టీలు, రాజకీయ సమీకరణలలో మార్పులు జరుగుతాయని ఊహాగానాలు జోరందు కున్నాయి. జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. రాష్ట్ర ప్రభుత్వం సభలు, ర్యాలీలు నిషేధిస్తూ జీవో తీసుకురావడం కూడా ప్రతిపక్షాలకు అస్త్రంగా మారింది. జీవో నిషేధించాలని కోరుతూ ఉద్యమాలకు అన్ని పార్టీలు సన్నద్ధం అవుతున్నాయి. చంద్రబాబు, పవన్ జీవో నెం.1పై పోరాటం చేయాలని నిర్ణయించారు. రాజకీయంగా చర్చ మాత్రం ఎన్నికల కోణంలోనే కనిపిస్తోంది. కలిసి పని చేయాలని ఎజెండా ఎక్కడ దాకా నడుస్తుందనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఈ రెండు పార్టీల అధినేతల కలయికపై జిల్లాలోని వైసీపీ మాత్రం కొత్తగా ఏమీ లేదని పవన్ చంద్రబాబు దత్త పుత్రుడు అని రాజకీయ కోణంలోని ఈ భేటీ జరిగిందని వ్యాఖ్యానిస్తు న్నారు. జీవో పై చర్చించేందుకు భేటీ జరిగితే జీవో రద్దు చేసే వరకు పోరాడుతారా అనేది చూడాలి. రెండు పార్టీల కలయికపై టిడిపి శ్రేణులలో ఉత్సాహం ఇస్తుంది. గెలుపు ఓటములు ఎలా ఉంటాయి అనేదానిపై ఈ భేటీ కీలకంగా మారింది. గడపగడపకు ప్రభుత్వం పేరుతో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇంటింటికి తిరుగుతున్నారు. ఈ ప్రక్రియ ముగిసేసరికి ఎన్నికలు వస్తాయన్నది వైసీపీ అంచనా. టిడిపి ఇప్పుడున్న పరిస్థితులలో ఒంటరిగా పోటీ చేస్తే వైసీపీని ఢీకొనలేమనేది అంతర్గతంగా చర్చ సాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ ఏకపక్షంగా గెలిచింది. అదే జోరు తమకు కొనసాగుతుందని వైసిపి కేడర్ భావిస్తోంది. ఉద్యోగులు, పోలీసు వర్గాలు, మధ్యతరగతి వర్గాలలోను ప్రభుత్వంపై అసంతృప్తి రాజుకుంది. ఈ మార్పుల పైన పార్టీలలో ఎవరి అంచనాలలో వాళ్ళు ఉన్నారు. చంద్రబాబు పవన్ భేటీ సామాజిక మాధ్యమాలలో పెద్ద ఎత్తున చర్చలు మొదలయ్యాయి. సోషల్ మీడియాలో టిడిపి శ్రేణులలో ఉత్సాహం పెరిగినట్లు పోస్టుల సారాంశం ద్వారా వ్యక్తం అవుతుంది. ఇద్దరూ కలిస్తే జగన్ పని అయిపోయినట్లేనని ప్రచారాలు సాగిస్తున్నారు. టీడీపీ క్యాడర్ జనసేనతో జతకట్టాలని భావిస్తున్నది. ఇదే జరిగితే 2014 ఎన్నికలలో పరిస్థితి పునరావృతం అవుతుందని అంచనా వేస్తున్నారు. 2019లో విడివిడిగా పోటీ చేయడం వల్ల పలుచోట్ల ఓటమిపాలయ్యమని భావిస్తున్నారు. జనసేనకు సీట్లు కేటాయింపులపై చర్చలు అంతర్గతంగా కొనసాగుతున్నాయి. ఓట్లు ఆధారంగానే గెలుపు ఓటములు ఉంటాయనేది బహిరంగ రహస్యం. వైసీపీలో సీటుపై నమ్మకము లేని కొందరు నేతలు టిడిపి, జనసేన వైపు వెళ్లడానికి తమ వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. బీజేపీతో ఎలాంటి వ్యూహం ఉంటుందనేది స్పష్టత రాలేదు. టిడిపి,జనసేన పార్టీల నడుమ పొత్తు లేకుండా చేయాలనే వ్యూహంలో వైసీపీ పావులు కదుపుతోంది. వామపక్షాలు మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, సమస్యలపై పోరాటాలు చేయడం పైనే దృష్టి కేంద్రీకరించింది. వైసీపీ విధానాలను వ్యతిరేకిస్తూనే, బిజెపి అవలంబిస్తున్న విధానాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పిస్తూ ఎండ గడుతోంది. అన్ని రాజకీయ పక్షాలు తమ వ్యూహాలతో ఎన్నికల వైపు అడుగులైతే వేగంగా పడుతున్నాయి.

ప్రత్యేక హోదాతోనే ఉపాధి, ఉద్యోగాలు

- 20 నుండి హిందూపురం టు ఇచ్ఛాపురం వరకు బస్సు యాత్ర
- ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు

విశాలాంధ్ర - తణుకు : రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన ప్రత్యేక హోదా హామీ అమలు జరిగితేనే రాష్ట్రంలోని యువతకు ఉపాధి, ఉద్యోగాలు వస్తాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు అన్నారు. మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా తణుకులో వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా సమితుల సమా వేశం సిహెచ్ సుందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన లెనిన్ బాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం ద్వారా అన్ని విధాలుగా ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే నష్టపోయింద న్నారు. విభజన హామీల సాధన కోసం ఈనెల 20వ తేదీ నుండి సత్యసాయి పుట్టపర్తి జిల్లా హిందూపురం నుండి ఫిబ్రవరి 4వ తేదీ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక హోదా రావడం ద్వారా రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటుతోపాటు వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి నిధులు రాజధాని , పోలవరం ప్రాజెక్టు నిర్మాణ కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తామని చెప్పి నేటి వరకు హామీని అమలు చేయకపోవడం మోదీ ప్రభుత్వ నిర్లక్ష్యమని అన్నారు. ముఖ్య మంత్రి జగన్ ప్రతిసారి ఢిల్లీకి వెళ్లిన వెంటనే ప్రత్యేక హోదాపై వినితి పత్రం ఇచ్చామని చెబుతున్నారని, అక్కడ జరిగిన అంశాలు, చర్చల వల్ల ఏపీకి ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదని విమర్శించారు. విద్యార్థి, యువజన సంఘాలు ఐకమత్యంగా రాష్ట్ర ప్రజల సమస్యలపై సమిష్టిగా ఇతర విద్యార్థి సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాల ద్వారా ప్రత్యేక హోదా, యువజన హామీల సాధన కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈనెల 28వ తేదీన భీమ వరంలో బహిరంగ సభ, పాలకొల్లులో సభలు నిర్వహించి ప్రత్యేక హోదా విభజన హామీల సాధన కోసం జరుగుతున్న బస్సు యాత్ర విజయవంతం చేస్తామని భీమారావు తెలిపారు. ఈ సమా వేశంలో సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు,ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి. పవన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు యు. వెంకట్, ప్రేమ్, కె. శివ, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు యు. మురళి తదితరులు పాల్గొన్నారు.

స్కూలు వద్ద సారా అమ్మకాలు వద్దు

- ఫిర్యాదుల బాక్సులో విద్యార్థి వేడుకోలు

విశాలాంధ్ర - లింగపాలెం : స్కూళ్లలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్సుల తనిఖీ లింగపాలెం తహశీల్దార్ కార్యాలయంలో జరిగింది. పలు స్కూళ్లలోని ఫిర్యాదుల బాక్సులో విద్యా ర్థులు చేసిన లిఖిత పూర్వకమైన సమస్యలు అధికారులకు కనువిప్పు కలి గించే విధంగా ఉన్నాయి. ధర్మాజీగూడెం భట్రాజులపేటలోని ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న లావణ్య అనే విద్యార్థిని తన స్కూలు సమీపంలో సారా అమ్ముతున్నారని, దీనిని ఆపించాలని కోరింది. ఇదే స్కూలుకు చెందిన ఐదవ తరగతి విద్యార్థి లోహిత తమ స్కూలులో చదువుతున్న 3, 4, 5 తరగతులను హైస్కూలులో కలపొద్దంటూ ఫిర్యాదు బాక్సులో వేసింది. ఇదే స్కూలులోని ఐదవ తరగతి విద్యార్థి నాగసౌమ్య రోడ్డు పక్కన ఉన్న తమ స్కూలు ముందు నుంచి వాహనాలు అతివేగంగా వెళ్తున్నాయని, ఈ రోడ్డులో స్కూలు సమీపంలో స్పీడు బ్రేకర్లు వేయాలని ఫిర్యాదులో కోరింది. ఇదే గ్రామంలోని ప్రధాన ప్రాథమిక స్కూలుకు చెందిన నాల్గవ తరగతి విద్యార్థి లక్ష్మణ సాయి మధ్యాహ్నపు భోజనంలో ఇస్తున్న సాంబార్ బాత్‌ను తొలగించి మరో వంటకం పెట్టాలని కోరింది. స్కూళ్లల్లో పెట్టిన ఫిర్యాదు బాక్సులను తహశీల్దార్ ముందు 15 రోజులకొకసారి పరిశీలించాలి. మంగళవారం జరిగిన తనిఖీలలో ప్రధానంగా వచ్చిన ఈ ఫిర్యాదులను కలెక్టర్‌కు తెలియపరుస్తామని తహశీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణ తెలిపారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి గురజాల వారి కోర్టులో

O.S No 244/2015

బిట్వీన్ :

రాయి కృప బాయి వగైరాలు - వాదులు

మరియు

తోడేటి కృపానందరావు (లేటు) వగైరాలు - ప్రతివాదులు

టు

D5 : చలసాని ఎలియస్ డెటి రజని, భర్త లేటు తోడేటి కృపానందరావు తండ్రి చలసాని జగన్నాథ రావు, హిందు, వయస్సు 68 సం॥లు, రిటైర్డు టెలిఫోన్ జె.ఇ, రాజు సెంటరు, ఎంప్లాయర్స్ ఆఫీసు రోడ్డు, నూజివీడు, ఏలూరు జిల్లా, ఏ.పి

D6 : తోడేటి చంద్రం ఎలియాస్ చందు తండ్రి లేటు తోడేటి కృపానందరావు, చలసాని జగన్నాథరావు, హిందు వయస్సు 47 సం॥లు, రాజు సెంటరు, ఎంప్లాయర్స్ ఆఫీసు రోడ్డు, నూజివీడు, ఏలూరు జిల్లా.

D7 : తోడేటి నీలిమా తండ్రి లేటు తోడేటి కృపానంద రావు, చలసాని జగన్నాదరావు, హిందు వయస్సు 45సం॥లు,రాజు సెంటరు, ఎంప్లాయర్స్ ఆఫీసు రోడ్డు, నూజివీడు, ఏలూరు జిల్లా. ఏ.పి

పై నెంబరు దావా నందు తోడేటి కృపానందరావు మరణించినందున అతని వారసులుగా మిమ్ములను D5 టు D7 ప్రతివాదులుగా చేర్చియున్నారు. సదరు వాజ్యంలో మిమ్ములను D5 టు D7 ప్రతి వాదులుగా చేర్చిన సంగతులను హైకోర్టు వారు మీకు పలు పర్యాయములు దావాలో సమన్లు పంపిచినను మీకు దావా సంగతి ఎరుక వుండి కూడా. కావాలని ఉద్దేశ్య పూర్వకంగా పైనంబరు దావాలో సమన్లు తీసుకోనక కాలయాపన చేయు చున్నందున హైకోర్టు వారు మీపై ఈ పేపర్ ప్రకటన ద్వారా సదరు పార్టిషన్ దావా మీపై పెండింగ్లో ఉన్న విషయంను తెలియపర్చమన్నందున తెలియ పరచడమైనది. సదరు దావా **ది.02.02.2023వ తేదిన ఉదయం 10.30 నిమిషాలకు** వాయిదా అయి వున్నది. ఆ రోజున మీరు స్వయంగా గాని వకీల్ ద్వారా గాని హాజరై పై నెంబరు దావా నందు మీకున్నూ అభ్యంతరములను లేక ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షము యందు విచారించి కోర్టు వారు తీర్మానించదరని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

వాయిదా తేది : 02.02.2023వ

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

కనకం ఆదినారాయణ, BA. BL అడ్వకేట్,

గురజాల, పల్నాడు జిల్లా.

సెల్ నెంబరు 9885135746.

కోడి కత్తులు స్వాధీనం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : బంగారు గూడెం శివారు ప్రాంతంలో కోడి పందాలు ఆడు తున్న సమయంలో రూరల్ పోలీసులు దాడి చేసి 530 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు డి.ఎస్.పి త్రినాథ్ మంగళవారం విలేక రుల సమావేశంలో తెలిపారు. డిఎస్ పి తెలిపిన వివరాల ప్రకారం తమకు అందిన సమాచారం మేరకు రూరల్ మండలం బంగారు గూడెం శివారు ప్రాంతంలో కోడిపందాలు ఆడుతు న్నారని తెలుసుకుని రూరల్ పోలీసులు దాడి చేశారని ఈ దాడులలో 530 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పలువురిని అరెస్టు చేశామన్నారు. కొమ్ముగూడెం, వీరంపాలెంకు చెందిన పలివెల వెంకటేశ్వర రావు, పెండెం మూర్తి, పుల్లాయిగూడెం,కృష్ణా పురానికి చెందిన గుగ్గిలపు రామారావు లను అరెస్టు చేశామని డిఎస్ పి వివరించారు.

ఉద్యమాలతో ప్రారంభమైన విశాలాంధ్ర

విశాలాంధ్ర - తణుకు : కార్మిక, కర్షక, ప్రజా హక్కుల కోసం పోరాడుతూ ఉద్యమాలతో పుట్టిన పత్రిక విశాలాంధ్ర తెలుగు దినపత్రిక అని రాష్ట్ర పౌర సరఫరాల వినియోగదారుల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు కొనియాడారు. స్థానిక వైసీపీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ పత్రికలు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలని కోరారు. ప్రజా సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. కార్మికుల హక్కుల కోసం కమ్యూనిస్టులు చేస్తున్న ప్రతీ ఉద్యమాన్ని విశాలాంధ్ర దినపత్రిక ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడంలోను, ప్రజా సమస్యలు పరిష్కారం దిశగా చేయడంలోను అగ్ర బాగాన ఉందని కొనియాడారు.

సాంప్రదాయాలను గౌరవించాలి

విశాలాంధ్ర - లింగపాలెం : సాంప్రదాయాల వల్ల ప్రజల్లో అనురాగాలు ఉంటాయని, వీటిని ప్రతీ ఒక్కరూ అనుస రించాలని తహశీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణ, సీఐ మల్లేశ్వరరావు, మండ విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. సంక్రాంతి సందర్భంగా శింగగూడెం హైస్కూలులో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను మంగళవారం వీరు ప్రారంభించారు. మన దేశంలోని సంప్రదాయాలు ప్రపంచంలో మరెక్కడాలేవని, అటువంటి సంప్రదాయాలను మనం గౌరవించాలని అన్నారు. సంక్రాంతి సీజనులో యువత జూదాలపై వెళ్ళవద్దని పేర్కొన్నారు. జూద క్రీడలను నిర్మూలించాలనే లక్ష్యంతో ధర్మాజీగూడెం ఎస్ఐ చెన్నారావు మండల స్థాయిలో వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారు. వీటిని మంగళవారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు పోటీలు జరుగుతాయి. అనేక మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనేందుకు తరలివచ్చారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, శింగగూడెం స్కూలు ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మేధా ఇంగ్లీషు మీడియం స్కూల్లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రేపల్లె గ్రామంలో ఉన్న మేధా ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద ఏర్పాటుచేసిన సంక్రాంతి సంబరాలలో మహిళలు అత్యధి కంగా పాల్గొని రంగు రంగుల హరివిల్లులతో ముగ్గులను వేసి వారి ప్రతిభను కనబరిచారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి, జడ్పిటిసి సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి , టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘాదేవి, వైస్ ఎంపీపీ మట్ట వన జాక్షి చేతుల ఎంపీటీసీ నారా అన్నపూర్ణ,చేతులమీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులను అందజేశారు. సంక్రాంతి సంబరాలలో చిన్నారులు, చిత్ర, విచిత్ర, వేషాలతో, నృత్యాలతో అలరించారు. పోలవరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మొడియం శ్రీనివాసరావు, విద్యా సంస్థల కరస్పాండెంట్ నల్లూరి మధు, ప్రిన్సిపాల్ వరికుంట ధనరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రూత్ కళ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - ఉండి : ఉండి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు, ఎన్ ఆర్ పి అగ్రహారం గ్రామ మాజీ సర్పంచ్ కన్నెగంటి రూత్ కళ జన్మదిన వేడుకలు ఆమె నివాసంలో తెలుగు తమ్ముళ్ల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.రూత్ కళ పార్టీ లో క్రియాశీలక సభ్యురాలుగా పనిచేస్తూ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేయించి ఆమెకు శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాగిత మహంకాళి, చెన్నంశెట్టి హరినాయుడు, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, బురిడి రవిబాబు, కిన్నెర వెంకన్న, గంధం బుజ్జి, కాగిత బుజ్జి, మజ్జి కృష్ణ ప్రసాద్, గొల్ల జాన్ కెనడీ విక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు వ్యతిరేకంగా స్కానింగ్, ఏఆర్టీ కేంద్రాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-ఏలూరు: నిబంధనలకు వ్యతిరేకంగా ఏ ఆర్ టి, స్కానింగ్ కేంద్రాలు నిర్వహిస్తే అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. నాగేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఆర్ఆర్ పేట లోని విగ్నేష్ టెస్ట్ ట్యూబు టేబీ సెంటర్ ఎఆర్ టి లెవెల్, ఎన్ఆర్ పేట లోని శ్రీకృష్ణ ఫెర్టిలిటీ క్లినిక్ ఎఆర్ టి లెవెల్ సెంటర్ లను జిల్లా వైద్య అధికారి బృందం అనుమతులను మంజూరు కోసం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారి మాట్లాడుతూ జాతీయ ఎఆర్ టి, సర్జరీ పోర్టల్లో నమోదు చేసుకొన్న దరఖాస్తు ద్వారా ఆసుపత్రి పరిసరాలు, ఉద్యోగులు, ఇతర సదుపాయాలను పరిశీలించి వివరాలు నమోదుచేశారన్నారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ భాను శైలజ ,రెడ్ క్రాస్ చైర్మెన్ డాక్టర్ బి.వి.కృష్ణ రెడ్డి , మానిటరింగ్ కన్సల్టెంట్ వడ్డీ సత్యా రవి , సోషియాలజిస్ట్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర - పాలకొల్లు : అర్హులైన ప్రతి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా జాయింటు కలెక్టరు జెవి మురళి ఆదేశించారు. మంగళవారం పాలకొల్లు మండలం దిగమర్రు, కొత్త పేట,ఆగర్రు, బల్లిపాడు గ్రామ సచివాలయాలను, దిగమర్రు జాతీయ రహదారుల ప్రభుత్వ భూములను జిల్లా జాయింటు కలెక్టరు జెవి మురళి ఆకస్మికంగా తనిఖీలు,పరిశీలన చేశారు.ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం దిగమర్రు జాతీయ రహదారుల సంబంధించిన ప్రభుత్వ భూములను అధికారులతో జిల్లా జాయింటు కలెక్టరు పరిశీలన చేశారు. జిల్లా జాయింటు కలెక్టరు వెంట తహశీల్దారు జి. మమ్మీ, యం పి డి వో యస్. వెంకటేశ్వర రావు, వ్యవసాయ శాఖ అధికారి యస్. అబ్దుల్ రహీమ్, గ్రామ సచివాలయం , సర్వే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ లారీలో అగ్నిప్రమాదం

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం బాదంపూడి నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే రహదారిలో కంటైనర్ లారీలో అగ్ని ప్రమాదం జరిగింది. ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం వెళ్తున్న లారీలో పొగలు రావటాన్ని నారాయణపురానికి చెందిన విశ్రాంత ఆర్మీ బాలు, పైడి వర ప్రసాద్ లు చూసిన వాహన దారులు డ్రైవర్ను అప్రమత్తం చేశారు. వెంటనే లారీని పక్కకు పెట్టి తలుపులు తెరిచే చూసేసరికి లోపల పొగ వ్యాపించాయి. వెంటనే అందులోని సామగ్రి లను కిందకి దింపేశారు. పలు ఔషధాలు, గృహ ఉపయోగ సామాగ్రి పెట్టెలు రవాణా చేసినట్టుగా తెలుస్తోంది.

హెల్మెట్ లేని డ్రైవింగ్ నేరం

విశాలాంధ్ర -భీమవరం టౌన్: హెల్మెట్ లేని డ్రైవింగ్ నేరమని భీమవరం ట్రాఫిక్ సిఐ దాసు అన్నారు. మంగళవారం ఆయన విశాలాంధ్ర ప్రతినిధితో మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే ప్రతి వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు. హెల్మెట్ కూడా ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయకూడదని జిల్లావ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అవగాహన కార్యక్ర మాలు చేపడు తున్నామన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్కువ శాతం హెల్మెట్ ధరించకపోవడం మూలంగానే మరణాలు సంభవిస్తున్నాయని ప్రపంచ గ ణాంకాలు చెబుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించడం వల్ల కొద్దిపాటి ప్రమాదం నుంచి బయట పడవచ్చన్నారు.

కోడి పందాలు నియంత్రించండి

విశాలాంధ్ర పెంటపాడు: మండలంలో సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, జూదం, గుండాటలు నిర్వహించ కుండా అరికట్టాలని సీపీఐ మండల కార్యదర్శి కలింగ లక్ష్మణ రావు మంగళవారం ఎస్ఐ కి విజ్ఞాపన పత్రం అందజేశారు.వీటిని ప్రోత్సహించే వారి పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కళింగ లక్ష్మణరావు వెంట బండారు శ్రీనివాసరావు, బోడబళ్ల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

మామిడి రైతులకు అవగాహన



విశాలాంధ్ర - చింతలపూడి : విజ్ఞాన శాఖ చింతలపూడి మండలం ఆధ్వర్యంలో తోట బడి కార్యక్రమంలో భాగంగా నాగిరెడ్డి గూడెంలో మంగళవారంమామిడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి అమర్ నాథ్ మాట్లాడుతూ మామిడి పూత దశలో తీసుకోవలసిన జాగ్రత్తల పై రైతులకు అవగాహన కల్పిం చారు. మామిడి పూత బాగా రావడానికి, మామిడి కాయ కోత అనంతరం నీటి తడులు, సిఫారస్సు చేయబడిన ఎరువులు వేయాలన్నారు.అక్టోబర్ మాసం లో చెట్లకు 13. 0. 45, 5 నుండి 10 గ్రాములు, చిలటెడ్ జింక్ 2 గ్రా, నీటి లో కరిగే బోరోన్ 2 గ్రా లీటర్ నీటికి కలపి పిచ్ కారి చెయ్యాలన్నారు. తేనె మంచు పురుగు, తామర పురుగుల నివారణకు తైయా మిథాక్సామ్ 0.4 గ్రా,లీటర్ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిలి, లేదా డయఫెన్ థురాన్ 1 గ్రా లీటర్ నీటికి కలపి 2 నుండి 3 పిచ్ కారి లు చెయ్యాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు, ఉద్యాన సహాయకులు సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాలు , జూదం నియంత్రణకు రెవిన్యూ, పోలీస్ యంత్రాంగం

విశాలాంధ్ర -ఉంగుటూరు: ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం డివిజనల్ పంచాయితీ అధికారి టి. అన్నమణి అధ్యక్షతన కోడిపందాల నియంత్రణ పై తీసుకోవలసిన చర్యలపై ఉంగుటూరు, గణపవరం, నిడమర్రు పంచాయతీ సెక్రటరీలతో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా డి ఎల్ పివో అన్నమణీ మాట్లాడుతూ కోడిపందేలు , జూదాలు నియంత్రణకు తీసుకోవలసిన చర్యలు, టాంటాం ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడం వంటి అంశాల గురించి తెలిపారు. కోడిపందాలు, గుండాట వంటి అసాంఘిక చర్యలకు అవకాశం వున్న ప్రాంతాల్లో సంబంధిత స్థల యజమానులకు, నిర్వాహకులకు సర్వీస్ ప్రొవైడర్లు ఐనా, షామియనా, లైటింగ్, మైకు వారికి ముందస్తు నోటీసులు ఇవ్వాలన్నారు. సమాచారం ఎప్పటికప్పుడు గ్రామ టీమ్ సభ్యులకు, రెవెన్యూ, పోలీసులకు తెలియపర్చాలన్నారు. సమా వేశంలో ఉంగుటూరు తహసీల్దార్ ఎ.వి.రమణారావు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం ఈవోపీఆర్డీలు ఎస్కె షంషుద్దీన్, వి. చంద్రశేఖర్, పి.వి. సత్యనారాయణ,చేబ్రోలు ఎస్ఐ సాంబశివరావు, మూడు మండలాల పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

దేవుడిని ఆత్మతో, సత్యముతో ఆరాధించాలి

- శాసన మండలి చైర్మన్ మోషన్ రాజు

విశాలాంధ్ర - గణపవరం : దేవుడిని ఆత్మతోను సత్యముతోను ఆరాధించి దేవుని దీవెనలు పొంది అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషన్ రాజు అన్నారు. మంగళవారం గణపవరంలో ఏసు క్రీస్తు ప్రభువు ఆరాధన ప్రార్థన ప్రకటన గుడారము చర్చి 13వ వార్షికోత్సవానికి మోషన్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు ఏసు క్రీస్తుని ఆరాధిస్తున్నారని కొనియాడారు. దేవుని ప్రేమ గొప్పదాని దేవుని యందు భయభక్తులతో ఉండాలన్నారు. క్రైస్తవుల అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అనేక పథకాలను అందజేస్తున్నారని , పాస్టర్లకు నెలకు గౌరవ వేతనం 5000 రూపాయలు ఇస్తున్నారని ఆయన అన్నారు. ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) మాట్లాడుతూ ఏసు క్రీస్తు కృప ద్వారా అనేకమంది అభివృద్ధి చెందారని కొనియాడారు. వైఎస్ఆర్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు మేడిది జాన్సన్ , గణపవరం చర్చి పాస్టర్ రెవ" ఎ.రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మూరా అలంకారం, దండు రాము, కాకర్ల విష్ణు శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో చైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - ఏలూరు : దేశవ్యాప్తంగా గత సంవత్సరం నవంబర్లో జివిఆర్ డయాబెటిస్ ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన వ్యాసరచన పోటీలలో స్థానిక బాలాజీ నగర్ శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరి చారని ప్రధానోపాధ్యాయులు మంత్రి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ మారుతున్న ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరికి డయాబెటిస్ వ్యాధిపై అవగాహన ఉండాలని, ఆ మహమ్మారి బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో డీన్ సుధాకర్, ప్రైమరీ ఇన్చార్జి స్వాతి, ప్రీ ప్రైమరీ ఇన్చార్జి జ్యోతి, విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ సిఎస్ఎన్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర -భీమవరం: డాక్టర్ సి ఎస్ ఎన్ డిగ్రీ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. భోగి మంటలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దులు నాట్యం, బొమ్మల కొలువు, ఫుడ్ స్టాల్స్ మొదలు కార్యక్రమాలతో క్యాంపస్ మొత్తం కొలహాలతో నిండిపోయింది. ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ రంగోలి డాన్స్ సింగింగ్ పోటీల్లో విద్యార్థులు జోష్ పుట్టించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ చీడే సత్యనారాయణ, గవర్నింగ్ బాడీ మెంబర్ వదుపు గోపి, ప్రిన్సిపల్ డాక్టర్ సకుమళ్ళ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ రమణ, రాజ్ కమల్, ప్రభాకర్ రావు, జితేంద్ర, కృష్ణారావు, సుధా, లావణ్య, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

భాష్యం స్కూల్లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - చింతలపూడి: స్థానిక భాష్యం పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మామిడి తోరణాలతో పాఠశాల ఆవరణాన్ని అలంకరించారు. రంగవల్లుల పోటీ నిర్వహించారు. గంగిరెద్దులతో ఆటలు ఆడించారు. హరిదాసులు వేషాలు ఆకట్టుకున్నాయి. బొమ్మల కొలువు, రకరకాల పిండి వంటలతో ప్రదర్శనలతో ఎంతో అంగరంగ వైభవంగా ఈ సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కంచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ సంక్రాంతి రైతులకు పంటల పండుగ, మగువులకు ముగ్గుల పండుగ, కన్నె పిల్లలకు గొబ్బిళ్ళ పండుగ, సర్వ జనావళికి భోజనాలు పండుగని సంక్రాంతి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : సంక్రాంతి సందర్భంగా గ్రామాలలో కోడిపందాలు నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కే. స్లీవ జోజి తెలిపారు. మంగళవారం మండలంలోని నాగుల గూడెం, పేరంపేట, పంగిడిగూడెం, లక్కవరం, టెక్కిన వారి గూడెం,అమ్మపాలెం, నిమ్మల గూడెం ,కట్టవ పాదలవారిగూడెం,తిరుమలాపురం కేతవరం గ్రామాలలో తహశీల్దార్ స్లీవ జోజి ఆయా గ్రామాల సర్పంచ్ లు,ఎంపిటిసి లు,వార్డు సభ్యులు పంచాయితీ కార్యదర్శులు, పోలీసులు, వి.ఆర్.ఓ లు,సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్థులతో గ్రామ సభలు నిర్వహించారు. నేడు, రేపు మండలంలోని అన్ని గ్రామాలలో తహశీల్దార్,ఎంపిడిఓ లను రెండు వేర్వేరు టీములుగా నియమించి గ్రామ సభలు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించినట్లు తహశీల్దార్ తెలిపారు.

హిందీ భాషా దినోత్సవం

విశాలాంధ్ర - పెంటపాడు : స్థానిక డిఆర్ జి ప్రభుత్వ కళాశాలలో అంతర్జాతీయ హిందీ భాషా దినోత్సవం ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శ్యాం బాబు, హిందీ భాష ప్రత్యేకతను ,ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియ జేశారు. ఈ సందర్భంగా హిందీ అభ్యసించే విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ పిఎస్ బ్రహ్మచారి, హిందీ విభాగం అధ్యాపకురాలు ఆర్ రమాదేవి, ఎన్ ఎస్ ఎస్ అధికారి జే విజయ్ బాబు, మిగిలిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

జీవో నెం ఒకటి రద్దు చేయాలి

విశాలాంధ్ర - వేలేరుపాడు : రాష్ట్ర ప్రభుత్వం తన ఇష్టానుసారంగా ఇటీవల తీసుకువచ్చిన జీవో నెం ఒకటి వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్లో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు మడివి దుర్గారావు మాట్లాడుతూ సమా వేశాలు, ప్రదర్శనలు నిర్వహించ రాదంటూ జీవో ఇవ్వటం సరైన చర్య కాదన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్రలు, నిరసన కార్యక్రమాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం తీరు ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధంగా ఉందని ఆయన విమర్శించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్ మాట్లాడుతూ పౌరహక్కులు హరించే విదంగా ఉన్న ఆ జీవోను వెంటనే రద్దు చేయాలనీ లేని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బొగరి వెంకటేశ్వర్లు, ఆటో యూనియన్ అధ్యక్షులు కురిమెల్ల శ్రీను, కార్యదర్శి ఉద్యమాలు మజ్జి శ్రీను, అఫ్రోజ్, కె. రమేష్, లక్ష్మాన్, ఆది, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో అందరికీ సంక్షేమం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని వెలిచేరు గ్రామ శివారు ఊదాలమ్మ గౌడ పాలెంలో కొత్తపేట నియోజకవర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 19 లక్షల రూపాయలతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటి ఇంటికి కుళాయి కనెక్షన్ల ఏర్పాటు, 15 లక్షల రూపాయలతో డ్రెయినేజీ నిర్మాణం, 6 లక్షల రూపాయలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు, 1.5 లక్షల రూపాయలతో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం షెల్టర్ ఏర్పాటు కొరకు శంకుస్థాపనలు నిర్వహించి, గడప గడపకూ వెళ్ళి, ప్రతీ కుటుంబానికీ ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరాయంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బోణం సాయిబాబా, ఎంపీడీఓ నాతి బుజ్జి, తహశీల్దార్ డీవీఎస్ అనిల్ కుమార్, వ్యవసాయ కమిటీ చైర్మన్ కనుమూరి శ్రీనివాసరాజు, సర్పంచి వేముల శ్రీనివాస్, స్థానిక ఎంపీటీసి వేముల వెంకటరమణ, ఆప్కాస్ డైరెక్టర్ కప్పల శ్రీధర్, నాయకులు కునాధరాజు రంగరాజు, వేముల రామన్న, వరదా గోపాలం, కోమలి సత్యనారాయణ, గంటి నాగేశ్వరరావు, కుందా లక్ష్మణరావు, కొత్తపేట ఎంపీపీ మార్గాని గంగాధర్, సురేష్ రాజు, కరుటూరి బ్రహ్మాజీ, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సంక్రాంతి అంటే జూదం కాదు

విశాలాంధ్ర - పాలకొల్లు: సంక్రాంతి అంటే కోడిపందాలు జూదాలు కాదని, సంక్రాంతి అంటే సాంప్రదాయ క్రీడలతో, ముగ్గులు, హరిదాసు కీర్తనలు తెలుగింటి వంటలు కుటుంబ సభ్యుల మధ్య ఆప్యాయత అనురాగాలతో గడపాలని పాలకొల్లు ఎమ్మెల్యే డా.నిమ్మల రామానాయుడు అన్నారు. అలాంటి సదుద్దేశంతోటే, ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా తన తండ్రి పేరు మీద స్థాపించిన ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. మంగళవారం పాలకొల్లు మండల స్థాయి ముగ్గుల పోటీలు లంకలకోడేరు గ్రామంలో ధర్మ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు.ఈ పోటీలలో మొదటి బహుమతి దగ్గులూరు గ్రామానికి చెందిన తమ్మ దుర్గభవాని గెలుపొందగా, 2వ బహుమతి ని, గవరపేట కు చెందిన దాడి బీమేశ్వరి గెలుపొందారు. లంకలకోడేరు గ్రామానికి చెందిన కుడక అన్నపూర్ణ తృతీయ బహుమతి పొందారు. విజేతలకు బహుమతులను పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు చేతుల మీదుగా అందజేశారు.

టీడీపీ కార్యకర్తలకు రుణపడి ఉంటా

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: తనపై ప్రేమాభిమానాలు చూపిస్తున్న నియోజకవర్గ ప్రజలకు, టీడీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని పోలవరం నియోజకవర్గ టిడిపి కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని వాడపల్లి కాలనీ వద్ద ఆయన క్యాంపు కార్యాలయంలో బొరగం శ్రీనివాసులు పుట్టిన రోజును పురస్కరించుకొని టిడిపి నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శ్రీనివాసులు పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 7మండలాల తెలుగుదేశం కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కోలాహలంగా బొరగం ను గజమాలతో సన్మానించి 100 కేజీల కేక్ ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బొరగం మాట్లాడుతూ తన వెంట ఉంటూ తనను ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీ గ్రంధాలయ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి, మద్దిపాటి వెంకట రాజు, కోళ్ళ నాగేశ్వరరావు అధిక సంఖ్యలో టిడిపి అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవో నెంబర్ వన్ రద్దు చేయాలని అంగన్వాడి కార్యకర్తల నిరసన

విశాలాంధ్ర-ఉంగుటూరు: ప్రజా ఉద్యమాలను అణిచివేయడం కోసం తెచ్చిన జి.ఓ.నం.1ను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడి కార్యకర్తలు ఆ కాపీని దగ్ధం చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడి కార్యకర్తలు ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద కొద్దీ సేపు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఏవి రమణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియూ నాయకుడు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పది రూపాయల నాణేలతో మోటార్ సైకిల్ కొనుగోలు

విశాలాంధ్ర - తణుకు : తణుకు పట్టణానికి చెందిన ఒక యువకుడు రూ. 1.65 లక్షల విలువైన రూ. 10 నాణేలతో మోటార్ సైకిల్ కొనుగోలు చేశారు. పట్టణంలోని వంటేద్దు సోమ సుందర్రావు హీరో షోరూంలో మంగళవారం ఉదయం బొబ్బిలి రాఘవేంద్ర కొనుగోలు చేశారు. సాధారణంగా 10 రూపాయల కాయిన్ లు చెల్లుబాటు కావడం లేదని అపోహలు నేపథ్యంలో కొనుగోలుదారుని నుంచి కాయిన్ లు స్వీకరించామని షోరూమ్ అధినేత వెంకట్ తెలియజేశారు.

సంక్షేమ రథసారథి జగన్‌కే అన్ని వర్గాల మద్దతు

విశాలాంధ్ర - ముదినేపల్లి : సంక్షేమ రథసారథి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కే అన్ని వర్గాల మద్దతు ఉందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని ఈడేపల్లి , సీతారాంపురం లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ఆకాంక్షల మేరకు పనిచేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని మరోసారి మద్దతు ఇచ్చేందుకు ముందుకు వస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఇంటికి లబ్ధి చేకూరేలా ఇంటి నిర్మాణం, ఇంటి స్థలం , చేయూత, ఆసరా , అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెన తదితర సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈడేపల్లి సర్పంచ్ అబ్బిశెట్టి వెంకటేశ్వరరావు, కొర్రగుంటపాలెం సర్పంచ్ పేరే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడిపందాలు పేకాట నిర్వహించే వారిపై చర్యలు తీసుకుంటామని జీలుగుమిల్లి తహసిల్దార్ గద్దం ఎలేషా అన్నారు. మంగళవారం పి. అంకంపాలెం సచివాలయం వద్ద ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. పేకాట, కోడిపందాలు ఎక్కడైనా నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నాలి శ్రీను, హెడ్ కానిస్టేబుల్ దేవిడ్ రాజు, విఆర్వో లు ముత్యం అశోక్, కుమార్, పంచాయతీ కార్యదర్శి దేవ ప్రియుడు, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఖోఖో పోటీలు

విశాలాంధ్ర - కాకినాడ : జెఎన్‌టియుకె క్రీడా ప్రాంగణంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సహకారంతో నిర్వహిస్తున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖో-ఖో టోర్నమెంట్ విజయవంతంగా కొనసాగింది. మంగళవారం జరిగిన పోటీలలో నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీపై ధర్వాడ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ 19-08 స్కోర్ తేడాతోను, శ్రీకాకుళంలోని డా బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీపై కోయంబత్తూర్‌లోని భారతీయార్ యూనివర్సిటీ 22-09 స్కోర్ తేడాతో గెలుపొందినట్లు జెఎన్‌టియుకె యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ & టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డా జి శ్యామ్‌కుమార్ తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీపై గుంటూరు లోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 25-10 స్కోర్ తేడాతోను, బెంగుళూర్‌లోని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్‌పై మధురైలోని మధురై కామరాజ్ యూనివర్సిటీ 18-12 స్కోర్ తేడాతోను, బళ్లారిలోని విజయనగర శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీపై కేరళ రాష్ట్రం కన్నూర్‌లోని కన్నూర్ యూనివర్సిటీ 13-12 స్కోర్ తేడాతో గెలుపొందాయి. కొట్టాయంలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీపై మైసూరులోని యూనివర్సిటీ ఆఫ్ మైసూర్ 15-13 స్కోర్ తేడాతోను, కడపలోని యోగి వేమన యూనివర్సిటీపై కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్సిటీ 18-03 స్కోర్ తేడాతోను, కేరళ రాష్ట్రం కన్నూర్‌లోని కన్నూర్ యూనివర్సిటీపై తమిళనాడులోని తిరువళ్లువార్ యూనివర్సిటీ 11-10 స్కోర్ తేడాతోను, సేలంలోని పెరియార్ యూనివర్సిటీపై బెళగావిలోని రాణి చన్నమ్మ యూనివర్సిటీ 20-16 స్కోర్ తేడాతో గెలుపొందాయి. కర్ణాటకలోని విశ్వేశ్వరాయ టెక్నలాజికల్ యూనివర్సిటీపై అనంత పురంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ 15-13 స్కోర్ తేడాతోను, చెన్నైలోని ఎం.జి.ఆర్.ఎడ్యుకేషనల్ & రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌పై ధర్వాడ్‌లోని కర్ణాటక యూనివర్సిటీ 18-08 స్కోర్ తేడాతోను, గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీపై విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ 19-03 స్కోర్ తేడాతోను, తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీపై హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ 21-10 స్కోర్ తేడాతోను, గుంటూరులోని కెఎల్ యూనివర్సిటీ కేరళలోని కేరళ యూనివర్సిటీ 21-05 స్కోర్ తేడాతోను, పుదుచ్చేరిలోని పాండిచ్చేరి యూనివర్సిటీపై వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ 14-13 స్కోర్ తేడాతోను, అనంతపురంలోని జెఎన్‌టియుఏపై కేరళలోని ఏపిజె అబ్దుల్ కలాం టెక్నలాజికల్ యూనివర్సిటీ 25-17 స్కోర్ తేడాతో గెలుపొందాయి. అలాగే బెంగుళూర్‌లోని బెంగుళూర్ యూనివర్సిటీపై సేలంలోని వినాయక మిషన్స్ రీసెర్చ్ ఫౌండేషన్ 22-02 స్కోర్ తేడాతోను, కర్ణాటక రాష్ట్రం తుముకూరులోని తుముకూర్ యూనివర్సిటీపై చెన్నైలోని యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ 13-12 స్కోర్ తేడాతోను, బెంగుళూరులోని బెంగుళూర్ సిటీ యూనివర్సిటీపై చెన్నైలోని తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ & స్పోర్ట్స్ యూనివర్సిటీ 24-16 స్కోర్ తేడాతోను, సేలంలోని నాయక మిషన్స్ రీసెర్చ్ ఫౌండేషన్‌పై బెళగావిలోని రాణి చన్నమ్మ యూనివర్సిటీ 15-14 స్కోర్ తేడాతోను, బెంగుళూర్‌లోని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్‌పై హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ 16-02 స్కోర్ తేడాతోను, కేరళలోని ఏపిజె అబ్దుల్ కలాం టెక్నలాజికల్ యూనివర్సిటీపై అనంతపురం లోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ 14-13 స్కోర్ తేడాతో గెలుపొందినట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జి. శ్యామ్‌కుమార్ తెలిపారు.

జీవో 1కు వ్యతిరేకంగా పోరాటం

విశాలాంధ్ర-వీరవాసరం: ప్రజా వ్యతిరేకత పెరుగుతుందని ప్రతిపక్షాలు ఉద్యమాలు, రోడ్ షోలు చేయకుండా కఠినంగా అణచి వేయాలని కాలం చెల్లిన బ్రిటిష్ చట్టం తీసుకొచ్చారని వీరవాసరంలో జరిగిన అఖిలపక్ష కమిటీ సమావేశంలో జనసేన మండలాధ్యక్షుడు గుండా రామకృష్ణ అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు పార్టీల నాయకులు మాట్లాడుతూ మండలంలో అన్ని పార్టీలు కలిసి జీవో 1 రద్దుకు పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని, సంక్రాంతి భోగి మంటలలో జీవో 1 కాపీలు వేసి పండగ చేసుకోవాలని తీర్మానించారు. ఈ సమావేశంలో తెలుగుదేశం అధికార ప్రతినిధి వీరవల్లి చంద్రశేఖర్, బిజెపి మండలాధ్యక్షుడు కోడి నరసింహం, కొల్లు వెంకట్రావు, నరేష్, సిపిఎం నాయకులు రెడ్డి రామారావు, బొబ్బనపల్లి సూర్య చంద్రరావు, జనసేన నాయకులు గుండా బాబు, యర్రంశెట్టి శీనయ్య, దుర్గా ప్రసాద్ తదితరులు మాట్లాడారు.

పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కాలేడు

విశాలాంధ్ర - పాలకొల్లు : సొంతగా పార్టీ పెట్టినంత మాత్రాన పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కాలేరని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైసీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి యడ్ల తాతాజీ విమర్శించారు. పాలకొల్లులో ఆయన కార్యాలయంలో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో తాతాజీ మాట్లాడుతూ ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలంటే ప్రజలకు ఎన్నో సేవలు చేయాలని, ప్రజల మనసుల్లో నిలిచిపోవాలన్నారు. రాష్ట్రంలో అలాంటి చరిష్మా ఉన్న నాయకుడు జగన్ ఒక్కరే అన్నారు. ప్రస్తుత జనసేన అధినేత చేష్టలు గమనిస్తే, అసలు జనసేన పార్టీ స్థాపించింది చంద్రబాబు కోసమేనా అనే సందేహం అందరిలోనూ కలుగుతోందన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అన్ని వర్గాలకూ సమన్యాయం చేస్తున్న జగన్ రాబోయే ఎన్నికల్లో విజయ దుందుభి మ్రోగిస్తారన్నారు.

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-వీరవాసరం: యువత ప్రతీ ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని భీమవరం రూరల్ సీఐ సిహెచ్.నాగప్రసాద్ అన్నారు. మండల కేంద్రం వీరవాసరంలో మద్దాల రామకృష్ణమ్మ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ను స్థానిక పాలిటెక్నికల్ కళాశాల గ్రౌండ్ లో మంగళవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత సాంప్రదాయ క్రీడలపై దృష్టి పెట్టాలని, చెడు మార్గాలు పట్టకుండా, కోడిపందాలు, జూదం ఆడకుండా సంప్రదాయ క్రీడల పట్ల మొగ్గు చూపాలన్నారు. మరో అతిథి వీరవాసరం ఎస్ఐ పి.రమేష్ మాట్లాడుతూ క్రీడల ద్వారా శరీర దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. సంక్రాంతి సమయంలో ఇటువంటి క్రీడలను ప్రోత్సాహించడం ద్వారా యువత జూద క్రీడల వైపు దృష్టి సారించకుండా సాంస్కృతిక క్రీడల వైపు దృష్టి సారించాలన్నారు. దీని ద్వారా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి 50వేల రూపాయలు, ద్వితీయ బహుమతి 25వేల రూపాయలు, తృతీయ బహుమతి 10వేల రూపాయలు అందజేయ నున్నట్లు యూత్ సభ్యులు తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన వారు కేశవ 994821117, మణి 9652991888, సెల్వరాజ్ 9912555,675 నెంబర్లలో టీం పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అండగా ప్రభుత్వం

విశాలాంధ్ర -భీమవరం టౌన్: చిరు వ్యాపారులకు తమ ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో డిఆర్డిఏ పిడి ఎమ్ఎస్ఎన్ వేణు గోపాల్‌తో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ అన్న తోడు కార్యక్రమంలో భాగంగా బుధవారం ముఖ్యమంత్రి జగన్ చిరు వ్యాపారుల ఖాతాల్లో వడ్డీ డబ్బులను జమ చేయనున్నారని పేర్కొన్నారు. భీమవరం నియోజవర్గంలో 5 వేల మంది చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించగా, వారు బ్యాంకులకు చెల్లించిన వడ్డీని నేడు తమ ప్రభుత్వం చిరు వ్యాపారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయడం జరుగుతుందన్నారు. జగనన్న తోడు పథకం వల్ల చిరు వ్యాపారులకు భీమవరం నియోజకవర్గంలో రూ. 12 లక్షల మేరకు లబ్ధి జరుగుతుందన్నారు.చిరు వ్యాపారులు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని తమ కుటుంబాలను పోషించుకోవడానికి గాను వడ్డీకి అప్పులు తెచ్చి వ్యాపారం చేస్తున్న నేపథ్యంలో, సాయంత్రం అయ్యేసరికి వచ్చిన ఆదాయం వడ్డీ కట్టడానికే సరిపోతుందని ముఖ్యమంత్రి జగన్ పాదయాత్రలో గుర్తించారన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు, కోమటి రాంబాబు, నామన మహేష్ పాల్గొన్నారు.

70 కిలోల వెండి మకర తోరణాలు వితరణ

విశాలాంధ్ర - అంబాజీపేట : మండలంలోని పుల్లేటికుర్రు గ్రామ పంచాయతీ వ్యాఘ్రేశ్వరంలో శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ వ్యాఘ్రేశ్వర స్వామి, శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్లకు 70 కిలోల వెండితో సుమారుగా ఆరులక్షల రూపాయల వ్యయంతో రెండు మకర తోరణాలు దాతల సహకారంతో సర్వేజనా సుఖినో భవంతు ట్రస్టు ఆధ్వర్యంలో ధనుర్మాసంలో మంగళవారం సంకట చతుర్దినాడు సంప్రోక్షం చేయించి బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణు గోపాలరావు, గ్రామ సర్పంచ్ జిల్లి బాలరాజు, ట్రస్టు చైర్మన్ అయ్యగారి వ్యాఘ్రేశ్వర సతీష్ రాజు, ప్రధాన కార్యదర్శి వక్కలంక రాధాక్రిష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్, లీగల్ అడ్వయిజర్ పొన్నాడ విశ్వనాథ్ రాజు, సీనియర్ సిటిజన్స్ బీర సూర్య ప్రకాశరావు, కుడుపూడి సత్యనారాయణ, బీర జగన్నాధం, అయ్యగారి వెంకట్రామయ్య, కాకర్ల నరసింహ రావు, బెహారా హనుమంత రావు, వాడ్రేవు రాంబాబు, అయ్యగారి వెంకటరత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యను దూరం చేసిన ఘనత జగన్‌దే

విశాలాంధ్ర - దేవరపల్లి: గ్రామీణ ప్రాంత విద్యార్థినీ విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని గోపాలపురం నియోజకవర్గ జనసేన నాయకులు దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మీపురంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో పార్టీ క్యాలెండర్‌ను సువర్ణరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 77, 55 జీవోలను తీసుకువచ్చి గ్రామీణ ప్రాంత ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనార్టీలకు చెందిన పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేశారని, పీజీ కోర్సులు చేయడానికి స్కాలర్ షిప్‌లు పొందడానికి పేద విద్యార్థులకు ఈ జీవోల వల్ల తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ కోర్సులలో జీవో నెంబర్ 55 తీసుకువచ్చి కొత్తగా మేనేజ్మెంట్ కోటాను తీసుకువచ్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందకుండా చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రాక్షస పరిపాలన పోవాలంటే జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేసి, జనసేన ద్వారా ఆయా వర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చేసే వరకు జన సైనికులు ప్రజల మధ్య ఉండి ప్రభుత్వ నియంత దుష్ట పాలనను ఎండగట్టాలని జనసైనికులకు సువర్ణరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలమాటి నాని బాబు, చప్పటి శివనాగ ప్రసాద్, కంబాల సత్తిబాబు, ఎం. సతీష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇదేం కర్మ మన రాష్ట్రానికి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం తాళ్ళరేవు పంచాయతీలో ముమ్మిడివరం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ఆదేశానుసారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం రోళ్ళ వారి వీధి, మాదవరాయుని పేట, గాంధీ నగర్, కేశవపురం కోలనీలో కార్యక్రమం జరిగింది. వైయస్సార్ ప్రభుత్వం లో అన్ని వర్గాల ప్రజలు మోసపోయామని, ప్రజలు ఎలక్షన్‌లు ఎప్పుడు వచ్చినా ఈ ప్రభుత్వంకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఇంటి ఇంటికి వెళ్ళి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వాశంశెట్టి శ్రీనివాసరావు, రోళ్ళ శ్రీనివాస చక్రవర్తి, నడింపల్లి సూర్యనారాయణ రాజు, గాదిరాజు సతీష్, బందారు శ్రీను, కుడిపూడి రామకృష్ణ, వడ్డి విజయ్, బుల్లెట్ జానీ, దాసరి వేణు, దుర్గా ప్రసాద్, శ్రీనివాస్, ధూళిపూడి వెంకటరమణ (బాబి) తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి 3 చక్రాల సైకిల్ అందజేత

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరం మండలంలోని లంకల గన్నవరం గ్రామానికి చెందిన కోలా సూర్యనారాయణ అనే దివ్యాంగుడికి జనసేన పార్టీ తరపున ఆ పార్టీ నాయకులు 3 చక్రాల సైకిల్‌ను అందజేశారు. గ్రామంలో ఈనెల 12న శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో చేపట్టబోయే బహిరంగ సభ పై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసలపూడి రామకృష్ణ, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు సాధనాల జేడి జనసేన నాయకులు యడ్ల ఏసు, యల్లమెల్లి చిట్టిబాబు, తాటికాయల శ్రీను, గనిశెట్టి శ్రీనివాస్, షేక్ దొరబాబు, యర్రంశెట్టి రమణ (టివి), గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు, స్పోర్ట్స్ డే వేడుకలు

విశాలాంధ్ర - గండేపల్లి : స్థానిక సూరంపాలెంలోని ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సందర్భంగా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రగతి స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ, విద్యార్థి దశలో విద్యార్థులందరూ క్రమశిక్షణ, ప్రతిభ, అకుంఠిత దీక్షతో పాటు సేవా తత్పరత కలిగి ఉండాలని తెలియజేసారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా మన సాంప్రదాయాలను గుర్తు చేస్తూ విద్యార్థినీ, విద్యార్థులందరికీ రంగోలీ, గాలిపటాలను ఎగురవేసే పోటీలను నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతలు అందజేసారు. ఈ కార్యక్రమాలలో భాగంగా కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు త్రోబాల్, వాలీబాల్, క్రికెట్, జావెలిన్ త్రో షాట్పుట్, 100 మీ., 400 మీ. & 800 మీ. రన్నింగ్ వంటి వివిధ గేమ్స్ నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సత్యనారాయణ మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు తమ ఆనందాన్ని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మేనేజ్మెంట్ ఎంవి హరనాథబాబు, డైరెక్టర్ డాక్టర్ ఎస్. శంభుప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఎమ్ సతీష్, వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నరేష్, వివిధ విభాగాధిపతులు, సీనియర్ అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.